పోస్టర్ విడుదల చేస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా కృషి

ఎదులాపురం, నవంబర్ 24 : సైన్స్‌పై అవగాహన పెంచడంతో పాటు శాస్త్రీ దృక్పథాన్ని పెంపొందించేలా జన విజ్ఞాన వేదిక కృషి చేస్తున్నదని ఆ వేదిక అధ్యక్షుడు ఉమాకాంత్ అన్నారు. ప్రపంచ జీవ పరిణామ దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జీవ పరిణామ సిద్ధాంత ప్రచారోద్యమ పోస్టర్‌ను ఆదివారం ఆదిలాబాద్లోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో విశ్రాంత విద్యాశాఖ అధికారి లింగయ్యతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఉమాకాంత్, నాయకులు ఊశన్న, నారాయణ రెడ్డి, గంగన్న, ప్రేమ్ కుమార్, శ్రీధర్‌బాబు, లింగన్న పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం చెబుతాం

నిర్మల్ అర్బన్, నవంబర్ 24: మహబూబ్‌నగర్ జిల్లా కొడంగల్‌లో నియోజకవర్గంలోని లగుచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని మూడు తండాలకు చెందిన లంబాడీ గిరిజనులపైన పోలీసులు అర్ధరాత్రి దాడి చేసి మహిళలను చూడకుండా అసభ్యకరంగా ప్రవర్తించి వారిని నిర్బంధించి అక్రమ కేసులు పెట్టించిన సీఎం రేవంత్ రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని భైంసా ఏఎంసీ మాజీ చైర్మన్ జాదవ్ రాజేశ్ బాబు, లంబాడీ జేఏసీ అధ్యక్షుడు అశోక్ నాయక్ అన్నారు. ఆదివారం నిర్మల్‌లోని టీఎన్‌జీవోస్ భవన్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి నాలుగు జిల్లాల్లో 40 ఎమ్మెల్యేల సీట్లను లంబాడీ సోదరుల సహాయంతో గెలుచుకున్నావని మా ప్రజలకు ఏదైన లబ్ధి చేస్తావని సీట్లో కూర్చోపెడితే అధికార దురంకారంతో భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నావని మండిపడ్డారు. కుటుంబ సభ్యుల ఫార్మా కంపెనీ కోసం భూములు లాక్కోవడం సరి కాదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, ఆడె గజేందర్, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎదులాపురం, నవంబర్ 24: చిరు వ్యాపారులకు సకాలంలో రుణాలు అందిస్తూ విస్తృత సేవలందిస్తున్నామని సేవ బ్యాంక్ హైదరాబాద్ రీజినల్ కోఆర్డినేటర్ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని టీఎన్జీవోస్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరువ్యాపారులకు అత్యవసర సమయంలో వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. గత మూడు దఫాలుగా బ్యాంక్ ఆదాయం నుంచి ఖర్చులు పోను మిగిలిన మొత్తాన్ని ఖాతాదారులకు అందిస్తున్నామని పేర్కొన్నారు. బ్యాంక్ ఆదిలాబాద్ అధ్యక్షుడు తన్వీర్, జీయ, ఆసిఫ్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

ఎదులాపురం, నవంబర్ 24: పట్టంలోని ఖుర్షిద్ నగర్‌కు చెందిన వివాహిత (34) అదృశ్యమైనట్లు టూ టౌన్ ఎస్ఐ కే విష్ణు ప్రకాశ్ తెలిపారు. శనివారం ఉదయం భార్యభర్తలు గొడవ పడ్డారు. దీంతో మహారాష్ట్రలోని తల్లి ఇంటికి వెళ్తున్నానని పిల్లలకు చెప్పి వెళ్లిపోయింది. ఆదివారం భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లా రజక ఉద్యోగ సంఘం కార్యవర్గం

ఎదులాపురం, నవంబర్ 24 : జిల్లా రజక ఉద్యోగ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం బీసీ సంఘం భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కల దత్తు, బీసీ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు నర్రా నవీన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి జక్కుల శ్రీనివాస్ సమక్షంలో నూతన కార్యవర్గం ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా అరుగుల స్వామి, జిల్లా అధ్యక్షుడిగా ముస్కు స్వామి ఉపాధ్యక్షుడిగా అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా అంపెల్లి లక్ష్మీనారాయణ, కోశాధికారిగా ఓరుగంటి రమేశ్ ఎన్నికయ్యారు.

ఏజెన్సీలో జీరో దందా..?

● లైసెన్స్ లేకుండానే దుకాణాల్లోనే పత్తి కొనుగోళ్లు ● తేమ శాతం పరిశీలించకుండానే కోతలు

● నిద్రమత్తు వదలని మార్కెట్ యంత్రాంగం ● నష్టపోతున్న రైతులు

పాతకాంటపై తుకాం వేస్తున్న పత్తి

నార్నూర్, నవంబర్ 24 : మూలిగే నక్కపై తాడిపండు పడ్డ చందంగా తయారైంది రైతన్న దుస్థితి. వర్షాభావ పరిస్థితులతో కొంత కాలం..ఎడతెరిపి లేని వర్షాలతో పత్తి పంటకు తెగుళ్లు ముసురు కోగా ఆశించిన దిగుబడి ప్రశ్నార్థకంగా మారింది. వారు తేమ బూచితో అందిన కాడికి దండుకుంటున్నారు దళారులు. అధికార యంత్రాంగం కూడా దళారులకే కొమ్ముకాస్తుండడంతో అన్నదాతల పరిస్థితి డోలయమానంలో పడింది. నార్నూర్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోతున్నది. గాదిగూడ, నార్నూర్, లోకారి(కే), మేడిగూడ, తాడిహత్నూర్ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు బహిరంగంగానే జరుగుతుంది. చిల్లర కాంటా వ్యాపారం జోరందుకుంది. జీరో దందా బహిరంగంగా విచ్చలవిడిగా సాగుతున్న మార్కెట్ అధికార యాంత్రాంగం కొనుగోళ్లకు అడుకట్ట వేయలేకపోతున్నారు. కనీసం మార్కెట్ యార్డులో పంట కొనుగోలు చేయాలని ఆదేశించిన దఖాలు కనిపించడం లేదు. వ్యాపారస్తులు మామూళ్లతో నోరు కట్టేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే నార్నూర్, గాదిగూడ మండలాల్లోని పల్లెల్లో దళారులు పాగా వేశారు. ఆదిలాబాద్, ఇంద్రవెల్లి, మధ్యప్రదేశ్, తమిళనాడు ఇతర ప్రాంత దళారులు గ్రామాల్లో కాంటాలు ఏర్పాటు చేస్తూ రైతులకు మాయమాటలు చెబుతూ పాతకాంటాలలోనే పత్తి పంటను కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ ద్వారా నాణ్యత కలిగిన పత్తికి రూ.7521 చెల్లించాలని ప్రకటించింది. కానీ, లైస్సెనులు వ్యాపారస్తులు, దళారులు రూ.6300-6800 మధ్య చెల్లిస్తున్నారు. కనీసం పత్తి తేమను పరిశీలించడం లేదు.



రైతుకు రాసి ఇచ్చిన చిట్టి

రోడ్డుపైన పత్తి కొనుగోలు

ఇదేమిటి అంటే తేమ సాకుతో పాటు తడిసిన పత్తింటూ నమ్మిస్తున్నారు. కోతల(కట్టిల) పేరిట నిండా ముంచుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లేదంటే పత్తిని తీసుకెళ్లండి అంటూ దళారులు చెబుతుండడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితి. చేసేది ఏమిలేక దళారులకే విక్రయిస్తున్నారు. ఇటీవల దళారులు లైస్సెనులు తీసుకోవాలని మార్కెటింగ్‌శాఖ నోటీసులు ఇచ్చిన దళారులకు చెవిన పట్టింపులేకుండా పోయింది. పత్తి కొనుగోలు చేసినప్పుడు బిల్లు రసీదు ఇవ్వాల్సి ఉండగా..కాగిత ముక్కపై రాసి ఇస్తున్నారు. పత్తి పంటకు ఏ ధర చెలిస్తున్నారో తెలియని దుస్థితి. ఇప్పటికైనా మార్కెటింగ్ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పత్తి పంటను నార్నూర్ ఉపమార్కెట్ యార్డులోనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటే కనీసం రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటుందని పలువురు రైతులు పేర్కొం టున్నారు. ఈ విషయంపై మార్కెటింగ్‌శాఖ జిల్లా అధికారి గజానంద్‌ను వివరణ కోరాగా..లైసెన్స్ లేకుండా పత్తి కొనుగోలు చేస్తే చర్యలు తీసుకుంటామని, పత్తి విక్రయించిన రైతుకు తప్పనిసరిగా బిల్లు రసీదు ఇవ్వాలని చెప్పారు.

బెల్ట్ రీడింగ్‌లో పాల్గొన్న క్రీడాకారులు

క్రీడాకారులకు బెల్ట్ రీడింగ్ టెస్ట్

ఎదులాపురం, నవంబర్ 24: ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సహా తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం క్రీడాకారులకు బెల్ట్ రీడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్థసారథి, సీనియర్ ఈడీ హరిచరణ్, సూపరింటెండెంట్ రాఖిల్ హాజరయ్యారు. కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ శిక్షణలో నేర్చుకున్న విద్యార్థులు బెల్ట్ రీడింగ్ టెస్ట్ పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ పెలియ శివప్రసాద్, జిల్లా సెక్రెటరీ అన్నారపు వీరేశ్, అఫీషియల్ సెక్రటరీ ఆకోజివార్ శృతి, ట్రెజరర్ మెంబర్ కన్య మాధవి, ఉపాధ్యక్షులు వనిత రాథోడ్, సీనియర్ కోచేస్ ప్రణయ్ కుమార్, శివకుమార్, తెలంగాణ అజయ్ పాల్గొన్నారు.

వేర్వరు ఘటనల్లో ఇద్దరు మృతి

కడెం, నవంబర్ 24 : కడెం మండలం అల్లంపల్లి గ్రామానికి చెందిన కస్తూరి రమేశ్ (26) మృతి చెందినట్లు ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. అల్లంపల్లి గ్రామానికి చెందిన కస్తూరి నరేశ్ కొంతకాలంగా గంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దత్తోజిపేటలో నివాసముంటు కూలీ పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 23వ తేదీన ఉదయం పనికి వెళ్లిన రమేశ్ తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య శిరీష భర్త కోసం కుటుంబ సభ్యుల ఇళ్లలో, చుట్టు పక్కల వెతికింది. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన రొడ్డ నర్సయ్య అనే వ్యక్తి రోడ్డుపై మరణించి కనపించడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించగా, రమేశ్ ఒంటిపై ఎలాంటి గాయాలు లేని కారణంగా అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే మండలంలోని మాసాయిపేట గ్రామానికి చెందిన తీగల రమేశ్ (33) కల్వర్టుపై పడి మృతి చెందినట్లు ఎస్ఐ కృష్ణ సాగర్‌రెడ్డి తెలిపారు. రమేశ్ గత కొంతకాలంగా లక్ష్మణచాంద మండలం చామన్‌పల్లిలో భార్యతో కలిసి నివాసముంటు అక్కడే కూలీ పని చేసుకుంటున్నాడు. ఈ నెల 23వ తేదీన తన మేనత్త మరణించడంతో అంత్యక్రియలకు స్వగ్రామానికి వచ్చి కార్యక్రమం అనంతరం మద్యం తాగి గ్రామ సమీపంలోని కల్వర్టుపై పడుకొని నిద్ర మత్తులో అక్కడి నుంచి కింద పడి మృతి చెందాడు. ఈ మేరకు ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానలో శవ పంచనామా నిర్వహించి భార్య సుకన్యకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు భోజన నాణ్యత పోటీలు

ఎదులాపురం, నవంబర్ 24 : విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి పోషణ్ అభియాన్ పోటీలు నిర్వహించినట్లు ఆదిలాబాద్ డీఈవో ప్రణీత తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాల ఆవరణలో ప్రధానమంత్రి పోషణ్ అభియాన్‌లో భాగంగా మధ్యాహ్న భోజన నిర్వాహకులకు భోజన నాణ్యత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చేసిన వంటలను డీఈవోతో పాటు న్యాయనిర్ణేతలు వాటి రుచులను చూశారు. అనంతరం ఎంపికైన వారికి మొదటి బహుమతి రూ.1500, రెండవ బహుమతి రూ.వెయ్యి, మూడో బహుమతి రూ.500 అందించనున్నామని డీఈవో తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన వారికి నగదు రివార్డును అందించామని, త్వరలో జరిగే రాష్ట్రస్థాయికి కూడా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కిరణ్, జిల్లా సైన్స్ అధికారి రఘు రమణ, కంటే నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

ఎదులాపురం, నవంబర్ 24: హైదరాబాద్‌లోని ప్రకాశం హాల్‌లోదివ్యాంగ ఉద్యోగులు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 1వ తేదీన నిర్వహించే రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు డీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో చలో హైదరాబాద్ కార్యక్రమం సంబంధించిన పోస్టర్‌ను సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా కొలువుదిరిన కాంగ్రెస్ ప్రభుత్వానికి దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు చెప్పుకునే అవకాశం కోసం ఈ సభను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముఖిమ్ జాని, కోశాధికారి అమృత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కబీర్ దాస్, రాజన్న పాల్గొన్నారు.

18ఏడీబీ24: పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

గ్రామానికి బస్సు ప్రారంభం

బస్సుకు పూజలు చేస్తున్న అధికారులు, నాయకులు, గ్రామస్తులు

దస్తురాబాద్, నవంబర్ 24 : మండలంలోని గొడిసేర్యాల గ్రామానికి చెందిన మహిళలు ఇటీవల రెండు సార్లు గొడిసేర్యాల ఎక్స్ రోడ్డు వద్ద ధర్నా నిర్వహించారు. రెండవ సారి నిర్వహించిన ధర్నాలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వచ్చి ధర్నా వద్దకు వెళ్లి గొడిసేర్యాల గ్రామానికి బస్సు వచ్చే విధంగా అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే ఇచ్చిన హామీతో గొడిసేర్యాల గ్రామానికి అధికారులు ఊట్నూర్ డిపోకు చెందిన బస్సును ప్రారంభించారు. గ్రామంలోని రాజరాజేశ్వర ఆలయం వద్ద బస్సుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆకర్షణీయ సిబిల్ స్కోర్‌కు ఆరు సూత్రాలు



పర్సనల్ లైనాన్స్‌లో మూడంకెల క్రెడిట్ స్కోర్‌కు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. మన దేశంలో వ్యక్తులు, కంపెనీల రుణ పరపతిని వారివారి రుణ చరిత్రల ఆధారంగా మదింపు చేయడంలో సిబిల్ (క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ఇండియా) లిమిటెడ్) సమాచారాన్ని ప్రధానంగా రుణదాతలు (బ్యాంకులు, ఇతరత్రా ఆర్థిక సంస్థలు) విశ్వసిస్తున్నారు. 300 నుంచి 900 వరకు క్రెడిట్ స్కోర్లను సిబిల్ ఇస్తున్నది. రుణాలు, క్రెడిట్ కార్డులు తదితర రుణ సదుపాయాల కల్పనలో వ్యక్తులు, సంస్థల అర్హతను నిర్ధారించడంలో ఈ స్కోరే కీలకం. అధిక స్కోర్ రుణగ్రహీతల ఆర్థిక పరిపుష్టికి నిదర్శనంగా నిలుస్తుంది. దీంతో రుణాలు సులభంగా లభిస్తాయి. పైగా తక్కువ వడ్డీరేటుకే దొరుకుతాయి. అలాగే స్కోర్ తగ్గితే రుణ లభ్యత అవకాశాలు కూడా అంతంతమాత్రంగానే ఉంటాయి. వడ్డీరేట్లూ ఎక్కువగానే పడుతాయి. సిబిల్ స్కోర్ 750, అం తకన్నా ఎక్కువగా ఉంటే వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులను విరివిగా అందుకోవచ్చు. ఒకవేళ స్కోర్ 685 కంటే తక్కువగా ఉంటే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు రుణాలిచ్చేందుకు వెనుకాడుతాయి. కాబట్టి ఆకర్షణీయ సిబిల్ స్కోర్ కూడా ఆర్థిక లక్ష్యాల్లో ప్రధానమే.

స్కోర్ పెంపునకు మార్గాలు

సకాలంలో చెల్లింపులు

క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేసే అంశాల్లో సకాలంలో జరిపే చెల్లింపులు కీలకం. తీసుకున్న రుణాలను గడువులోగా చెల్లించడం, వాటి ఈఎంఐలను నిర్ణీత తేదీల్లో మిస్సవ్వకుండా చూసుకోవడం ముఖ్యం. పేమెంట్లలో ఆలస్యం క్రెడిట్ స్కోర్‌ను వేగంగా తగ్గించడమేగాక, డిఫాల్టర్ (ఎగవేతదారు లేదా మొండి బకాయి)గా మార్చే ప్రమాదమూ ఉన్నది. దీని వల్ల భవిష్యత్తులో రుణ సదుపాయాలను అందుకోవడం కష్టమవుతుంది. ముఖ్యంగా గృహ, వాహన రుణాలు పొందడం పెద్ద సమస్యగానే పరిణమిస్తుంది.

పరిమితంగా రుణాలు

రుణాలను పరిమితంగా తీసుకోవడమే ఉత్తమం. మనకున్న రుణ పరిమితిలో దాదాపు 30 శాతాన్ని మాత్రమే వినియోగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడే క్రెడిట్ స్కోర్ బాగుంటుందని చెప్తున్నారు. సామర్థ్యానికి మించి ఉండే రుణ భారం వల్ల ఇబ్బందులు తప్పవు. కనుక అత్యవసరమైతే తప్ప రుణాల జోలికి వెళ్లకుండా ఉండటమే తెలివైన పని. అంతేగాక కీలకమైన గృహ రుణాల వంటి వాటికి అర్హత అనేది ఉంటుంది. కాబట్టి ప్రతీ చిన్న అవసరానికి అప్పులు చేయకుండా ఉండాలి.

అప్పుల అన్వేషణ వద్దు

కొత్త రుణాల కోసం తరచూ అన్వేషించడం కూడా మన క్రెడిట్ స్కోర్‌ను రిస్కులో పడేస్తుంది. రుణాల కోసం ఎక్కువగా వాకబు చేయడం వల్ల మన ఆర్థిక పరిస్థితి బాగాలేదన్న సంకేతాలు క్రెడిట్ బ్యూరో సంస్థలకు వెళ్తాయి. దీనివల్ల మన క్రెడిట్ స్కోర్ తగ్గిపోతూ ఉంటుంది. కాబట్టి అవసరం ఉన్నా.. లేకున్నా.. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల వద్దకు వెళ్లి రుణాల కోసం ప్రయత్నించకండి. దానివల్ల రుణదాతలు మీ రుణ చరిత్రను పరిశీలిస్తూ ఉంటారు. పదేపదే ఈ పని జరిగితే అది మీకే నష్టం.

పొరపాట్లను సరిచేయాలి

క్రెడిట్ స్కోర్‌ను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఉండాలి. అప్పుడప్పుడు మనం తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించినప్పటికీ ఆ సమాచారం క్రెడిట్ బ్యూరోకు ఉండదు. దానివల్ల మన క్రెడిట్ స్కోర్ పెరగకుండా ఉంటుంది. అలాంటప్పుడు రుణదాత (బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ)లను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది. ఇక ఇప్పుడు ఆన్‌లైన్‌లో చాలా ఏజెన్సీలు ఉచితంగానే మనకు క్రెడిట్ స్కోర్‌ను తెలియజేస్తున్నాయి. కనుక తరచూ మన స్కోర్‌ను చెక్ చేసుకోవడం ఉత్తమం.



గ్యారంటీలకు దూరంగా..

గ్యారంటీలకు దూరంగా ఉండాలి. మనలో చాలామంది స్నేహితులనో, బంధువులనో, తెలిసినవారు లేదా ఇరుగుపొరుగువారంటూ వారి రుణాలకు పూచికత్తు సంతకాలు చేస్తూ ఉంటాం. కానీ ఇదంత శ్రేయస్కరం కాదని ఆర్థిక నిపుణులు, బ్యాంకింగ్ వర్గాలు చెప్తున్నాయి. ఒకవేళ వారు తీసుకున్న రుణాలను చెల్లించకపోతే ఆ రుణ భారం మీ మీద పడుతుంది. ఆ రిస్కు పెరిగితే ఆటోమేటిగ్గా మీ క్రెడిట్ స్కోర్ సైతం క్షీణిస్తూ పోతుందన్న విషయం మరువద్దు. అందుకే తప్పని పరిస్థితుల్లో తప్ప వీలైనంత వరకు గ్యారంటీలకు దూరంగా ఉండాలి.

సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు

సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు వ్యక్తుల క్రెడిట్ స్కోర్‌ను పెంచడంలో దోహదపడుతాయి. సాధారణ క్రెడిట్ కార్డుల మాదిరి కాకుండా ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు మీరు చేసే డిపాజిట్ల ఆధారంగా లభిస్తాయి. పరిమిత రుణ చరిత్ర ఉన్నవారు, క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్నవారు వీటిని తీసుకొని మెరుగైన స్కోర్‌ను సాధించవచ్చు. మీరెంత నగదు డిపాజిట్ చేస్తే.. దానికి సమాన స్థాయిలోనే సదరు క్రెడిట్ కార్డు రుణ సదుపాయ పరిమితి ఉంటుంది. సకాలంలో కార్డు బిల్లులను చెల్లిస్తూపోతే స్కోర్ క్రమేణా పెరుగుతూపోతుంది.

రాబడి

పిల్లల విద్య కోసం..

పిల్లల విద్య కోసం ప్రణాళిక అనేది తల్లిదండ్రులకున్న అత్యంత కీలక ఆర్థికాంశం. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే వారి ఉన్నత విద్య ఖర్చుల కోసం పొదుపు చేయడం ఎంతో తెలివైన పని. అయితే అందుకున్న మార్గాలను పరిశీలిస్తే..

ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లు

పిల్లల ఉన్నత విద్య వంటి దీర్ఘకాల లక్ష్యాల కోసం స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు సరైన నిర్ణయమనే చెప్పవచ్చు. మ్యూచువల్ ఫండ్లలో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్) ద్వారా ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టవచ్చు.



హైబ్రిడ్ ఫండ్స్

హైబ్రిడ్ ఫండ్స్.. అటు ఈక్విటీల్లో, ఇటు డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెడుతాయి. వీటిలో రిస్క్, రిటర్న్స్ అనేవి సమతూకంగా ఉంటాయి.

విద్యా పథకాలు

వివిధ మ్యూచువల్ ఫండ్స్ పిల్లల విద్య కోసం రకరకాల పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. ఇవి ఈక్విటీలు, రుణ లేదా బంగారాల్లో పెట్టుబడులు పెడుతాయి.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు

తక్కువ రాబడులను అందించినా.. సురక్షిత పెట్టుబడులుగా వీటిని చెప్పుకోవచ్చు. ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే వీటిలో రిస్క్ ఉండదు. కచ్చితమైన రాబడులుంటాయి.

విద్యా రుణాలు

ట్యూషన్ ఫీజులు, రోజువారీ జీవన ఖర్చులు, ఇతరత్రా వ్యయాలను ఈ విద్యా రుణాలతో అధిగమించవచ్చు. పిల్లల విద్య పూర్తయిన తర్వాత తిరిగి చెల్లించేలా మారటోరియం పీరియడ్‌కు వీలుంటుంది. అంతేగాక పాత పన్ను విధానం కింద ఆదాయ పన్ను (ఐటీ) చట్టం లోని సెక్షన్ 80ఈ ద్వారా రుణగ్రహీతలు పన్ను మినహాయింపులనూ అందుకోవచ్చు.

బీమా ప్లాన్లు

చైల్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు.. అటు పెట్టుబడి, ఇటు బీమా సదుపాయంతో ఉంటాయి. ఒకవేళ పాలసీదారు దురదృష్టవశాత్తు చనిపోతే ఒకేసారి పెద్దమొత్తంలో కుటుంబీకులకు ధనసాయం లభిస్తుంది.

ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తారా?

ఒక కంపెనీ షేర్లను దాని ఈక్విటీలో పాల్గొని మదుపరులు కొనుగోలు చేయవచ్చు. లిస్టెడ్ కంపెనీలైతే వాటి షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదై ఉంటాయి. దీంతో ఎక్స్ఛేంజీల ద్వారా వాటిని కొనవచ్చు. ఇందుకు డిపాజిటరీ పార్టిసిపెంట్‌తో కూడిన డీమ్యాట్ అకౌంట్, బ్యాంక్ అకౌంట్‌లు అవసరం. అలాగే షేర్ల క్రయవిక్రయాల కోసం బ్రోకర్‌తో ఓ ట్రేడింగ్ అకౌంట్‌ను తెరవడం కూడా ముఖ్యమే.

ఈటీఎఫ్‌ల ద్వారా..

ఏదో ఒక షేర్‌లో పెట్టుబడులు పెట్టడానికి బదులుగా ఎక్స్ఛేంజ్‌పై నమోదైన ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఇండెక్స్ ఫండ్స్ (ఈటీఎఫ్)ను కొనడం ద్వారా మొత్తం ఇండెక్స్‌లోనే పాలుపంచుకోవచ్చు. అలాగే ఈటీఎఫ్ ఇన్వెస్ట్‌మెంట్.. పెట్టుబడి వైవిధ్యాన్ని కూడా చూపిస్తుంది.

ఈక్విటీ ఎంఎఫ్‌లు

ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) స్కీముల ద్వారా కూడా ఈక్విటీల్లో మదుపు చేయవచ్చు. ఈ పథకాలు తమ దగ్గరున్న నిధుల్లో 65 శాతం లేదా అంతకన్నా ఎక్కువ మొత్తాలను ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీల్లో పెట్టుబడిగా పెడుతాయి. ఎంఎఫ్ వెబ్‌సైట్ల నుంచి ఆన్‌లైన్‌లో లేదా డిస్ట్రిబ్యూటర్ ఆధారిత ఎంఎఫ్ లావాదేవీ పోర్టల్‌ల ద్వారా పెట్టుబడులకు వీలుంటుంది. సిప్ ద్వారా కూడా పెట్టుబడులకు దిగవచ్చు.

ఒడిదొడుకుల్లోనే పయనం



దేశీయ స్టాక్ మార్కెట్లలో తీవ్ర స్థాయిలో ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. గడిచిన నెల 15 రోజులుగా సూచీలు పడుతూలేస్తూనే పయనిస్తున్నాయి. దేశ, విదేశీ ప్రతికూలతల నడుమ మదుపరులు పెట్టుబడుల విషయంలో ఆచితూచి స్పందిస్తున్నారు. అయితే అమ్మకాలు.. లేదంటే కొనుగోళ్లకు పెద్దపీట వేస్తూ పోతున్నారు. ఈ క్రమంలోనే గత వారం సూచీలు పెద్ద ఎత్తున లాభాలను అందుకున్నాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,536.80 పాయింట్లు లేదా 1.98 శాతం ఎగిసి 79,117.11 వద్ద నిలిచింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 374.55 పాయింట్లు లేదా 1.59 శాతం ఎగబాకి 23,907.25 దగ్గర ముగిసింది. ఆ మునుపటి వారం ఇంతకన్నా ఎక్కువ నష్టాలపాలైన సంగతి విదితమే. ఇక ఈ వారం విషయానికొస్తే.. మార్కెట్లను ప్రభావితం చేసే అంశాలు చాలానే ఉన్నాయి. తీవ్రరూపం దాల్చుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అమెరికాలో అదానీపై కేసు, క్యూ2 జీడీపీ గణాంకాలు, విదేశీ మదుపరుల పెట్టుబడులు ప్రధానంగా చెప్పుకోవచ్చు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విల